క్లుప్తంగా

టీపీబీఓ రసూల్ సస్పెన్షన్

నెహ్రూనగర్: విధుల్లో నిర్లక్ష్యంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నోటీసులు జారీ చేసిన టీపీబీఓ రసూల్‌ని సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరుగుతున్న నిర్మాణానికి నగరపాలక సంస్థ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లేకుండా నోటీసులు జారీ చేయడమే కాకుండా, నోటీసు ప్రకారం గడువు వరకు వేచి ఉండకుండా నిర్మాణాన్ని ప్రణాళిక అధికారులు తొలగించారని పేర్కొన్నారు. దీనిపై టీపీబీఓ రసూల్‌ని విధుల నుంచి సస్పెండ్ చేయడంతో పాటు ఏసీపీ కాలేషా, డీసీపీ కోటయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలియజేశారు. అధికారులు అంకితభావంతో పని చేస్తూ జీఎంసీకి మంచి పేరు తేవాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు.

ఎస్ఈగా పూర్ణచంద్రరావు సేవలు అభినందనీయం



పాత గుంటూరు: అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో జిల్లా ట్రాన్స్‌కో అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఈ వెలివెల పూర్ణచంద్రరావును ఘనంగా సన్మానించారు. సభకు ఇన్‌చార్జ్ ఎస్ఈ కె. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు విద్యుత్‌శాఖకు పూర్ణచంద్రరావు అందించిన సేవల్ని కొనియాడారు. అనంతరం దుశ్శాలువాలు, పూలమాలలతో పూర్ణచంద్రరావు, కామాక్షిదేవి దంపతుల్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఈలు రామచంద్రారెడ్డి, మురళీకృష్ణ, ఈఈలు కె.వి. సురేష్, మంగయ్య, డీఈ ఎం.వెంకటేశ్వర్లు, అధికారులు, పూర్ణచంద్రరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో ఈత శిక్షణ శిబిరం ప్రారంభం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారులు తీవ్రమైన చదువు ఒత్తిడితో పాటు ఆటపాటలు లేకపోవడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని శాసనమండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుతో కలసి ప్రారంభించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ ఎందరో ప్రముఖ క్రీడాకారులు వేసవి శిక్షణ ద్వారా వెలుగులోకి వచ్చారన్నారు. తల్లిదండ్రులు కూడా వేసవి సెలవుల్లో చిన్నారుల్ని శిక్షణ కేంద్రాలకు, మైదానాలకు పంపాలని ఆయన కోరారు. సెలవుల్లో పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లతో గడుపుతారన్నారు. కాసేపు అయినా క్రీడా సాధన చేస్తే కొంత ఆట విడుపుతోపాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గోపి శ్రీనివాస్, షేక్ రోషన్, జీఎంసీ వీసీ సీహెచ్. శ్రీనివాసరావు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కౌన్సిల్ హాలు డిజైన్స్ మార్చాలి



నెహ్రూనగర్: పునఃనిర్మాణం జరుగుతున్న నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో మీడియా, విజిటర్స్ గ్యాలరీ ఏర్పాటు చేయాలని తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు నగర కమిషనర్ కీర్తి చేకూరికి విజ్ఞప్తి చేశారు. ఆమెను సోమవారం చాంబర్‌లో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కౌన్సిల్ హాలులో రెండు ఉండేవని కమిషనర్ దృష్టికి తెచ్చారు. గాంధీ పార్కు నిర్మాణ బడ్జెట్ వివరాలు తమకు తెలియదని, దానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయాలని కోరారు. తూర్పు నియోజకవర్గంలో టెండర్లు పూర్తయినప్పటికీ పనులు జరగడం లేదని, దీనిపై తగిన చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ స్టేడియంలో కార్పొరేటర్ కుటుంబ సభ్యులకు శాశ్వత సభ్యత్వం ఇచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వాటర్, శానిటేషన్ ఇతర విభాగాల కమిటీల్ని పునరుద్ధరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు.

యూటీఎఫ్ భవనం ప్రారంభం

చేబ్రోలు: యూటీఎఫ్ మండల కార్యాలయాన్ని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ భవనం ఉద్యమ, విజ్ఞాన కేంద్రంగా రూపొందించడానికి కృషి చేయాలని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేతలు ఉపాధ్యాయ సమస్యలతో పాటు కార్మిక, రైతు సమస్యలపై కూడా స్పందించాలని పిలుపునిచ్చారు.

శ్రమయేవ జయతే...

ఘనంగా మేడే వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా తదితరులు

పట్నంబజారు: అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. పాత గుంటూరు కొల్లి శారద కూరగాయల మార్కెట్ పక్కన నగరపాలక సంస్థ రోజువారి కూలీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పాల్గొన్నారు. వైఎస్సార్ టీయూసీ కార్మిక జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్‌తో కలసి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పలు ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం కలసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ కార్మిక చట్టాల్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు లేకపోతే మానవ మనుగడ కష్టమని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇర్రి ధనలక్ష్మి, మెహమూద్, ఆటో యూనియన్ నాయకులు కొండలు, పవన్, నరసింహారెడ్డి, గణేష్, వైఎస్సార్ సీపీ నేత ఝాన్సీ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యాలయ ఆవరణలో..

పాత గుంటూరు: పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాల్ని కార్మికులంతా ఐక్యంగా ఉంటూ కాపాడుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయం ఆవరణలో జిల్లా నాయకుడు వై. కృష్ణకాంత్ అధ్యక్షతన సీనియర్ నాయకుడు ఆది నికల్సన్ జెండా ఆవిష్కరించారు. వెంకటపతి స్తూపం వద్ద జెండాను నాయకుడు జి.వెంకట్రావు, కార్యాలయంలోని జెండాను లూథర్‌పాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల్ని కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ. అక్బర్, బి. సుధాకిరణ్, సుధీర్, శంకర్, ఎం. కిరణ్, కృష్ణ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..

నగరంలోని పలు ఆటో స్టాండ్లలో సీఐటీయూ జెండాల్ని ఆవిష్కరించి మేడే ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. హిందూ కాలేజీ కూడలిలో, మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా వద్ద, గుజ్జనగుండ్ల పెరుగు చెట్టు, అరండల్‌పేట, గోరంట్ల చిల్లీస్ సెంటర్, వికాస్ నగర్ మెయిన్‌రోడ్డు, ఏటీ అగ్రహారం బ్యాంక్ సెంటర్ తదితర చోట్ల జెండాల్ని సీఐటీయూ నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, ఆటో డ్రైవర్స్ యూనియన్‌నగర అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ అంబానీ, అదాని లాంటి పెట్టుబడిదారులకు సేవ చేస్తున్న మోదీ ప్రభుత్వానికి రవాణా రంగ కార్మికులు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాలల్లో యూనియన్‌నాయకులు కారసాల కొండలు, వేముల శ్రీను, అమీర్ బాషా, సునీల్, అశోక్, సాంబయ్య, శ్రీనివాసరెడ్డి, ఖాశీం, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్‌ఆధ్వర్యంలో..

నగరపాలక సంస్థ పరిధిలోని వెహికల్ షెడ్, శ్రీనివాసరావుపేట, గోరంట్ల, గాంధీపార్క్ వద్ద సీఐటీయూ జెండాల్ని ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరావు మాట్లాడుతూ కార్మిక వీరుల ప్రాణత్యాగంతో సాధించుకున్న సమ్మె హక్కు, ఎనిమిది గంటల పని విధానానికి మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. కార్మిక చట్టాలను కుదిస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని, వీటితో కార్మికుల్ని యజమానులకు బానిసలుగా మార్చేందుకు చూస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు ఆది నికల్సన్, టి. నర్సిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, యూనియన్ నాయకులు పూనేపల్లి శ్రీనివాసరావు, పాశం పూర్ణచంద్రరావు, కుంభా శివయ్య పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో..

కార్మిక హక్కుల్ని కాలరాస్తున్న ప్రభుత్వాల్ని గద్దె దించేందుకు 'మేడే' స్ఫూర్తితో కార్మిక వర్గం అంతా ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ నేత కె. నళినీకాంత్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గుంటూరు బైపాస్ రోడ్‌లో కోల్డ్ స్టోరేజ్ ఉద్యోగ కార్మికుల ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరించారు. నళినికాంత్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల్ని నిర్వీర్యం చేసేందుకు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొల్లా గోవిందు, విష్ణు, రమణ, కోటి, తిరుపతి, రమేష్, వెంకట్రావు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



సీఐటీయూ జెండా ఆవిష్కరణలో మాట్లాడుతున్న ముత్యాలరావు, మస్తాన్‌వలి

కార్మికుల ప్రాణత్యాగాల వల్లే ఎనిమిది గంటల పని దినాలు

కొరిటెపాడు(గుంటూరు): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం మార్కెట్ సెంటర్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం రాష్ట్ర నాయకుడు పి.కిషోర్‌కుమార్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1886లో కార్మికులు చేసిన ప్రాణత్యాగాల వల్లే ఈరోజు ఎనిమిది గంటల పని అమలవుతున్నదని స్పష్టం చేశారు. బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం నాయకులు రవిచంద్రారెడ్డి, బాషా, వేణు, పావని, విజయ క్రాంతి, ప్రభు కిషోర్, పృథ్వీ, శివ, జి.సి.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల శ్రమను గుర్తించాలి

కార్మికుల శ్రమను ప్రతి ఒక్కరూ గుర్తించాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు పేర్కొన్నారు. మేడేను పురస్కరించుకుని నగరంలోని సంఘ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో శ్రమ దోపిడీని అరికట్టాలని పిలుపునిచ్చారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మేడే వేడుకల్ని పురస్కరించుకుని కృష్ణానగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు నల్లమోతు రామారావు మాట్లాడుతూ కార్మికులు సమైక్యంగా పోరాడి హక్కుల్ని కాపాడుకోవాలని తెలిపారు.



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మానవతా సంస్థ నిర్వాహకులు

ట్రేడ్ యూనియన్ ఉద్యమ పితామహుడు లోఖాండే

నెహ్రూనగర్: భారతదేశంలో మొట్టమొదటి కార్మికుల హక్కుల కోసం నిరంతరం శ్రమించిన మహనీయుడు నారాయణ్ మేఘజీ లోఖాండే అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో లోఖాండే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోఖాండే ట్రేడ్ యూనియన్ నాయకుడిగా కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు.



లోఖాండే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భీమ్ భారత్ నాయకులు

ఉన్నత చదువులతో ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వం

నగర మేయర్ కావటి



నియామకపత్రాలు అందజేస్తున్న మేయర్ మనోహర్ , సాంకేతిక విద్య జేడీ పద్మారావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ధ్యేయంగా ఉన్నత చదువులు చెప్పిస్తున్న ప్రభుత్వం ఉద్యోగాల్ని సైతం కల్పిస్తోందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఉద్యోగ విజయోత్సవంతో పాటు కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా పాఠశాలలకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జీవం పోశారన్నారు. పాఠశాలతో పాటు ఉన్నత విద్య వరకు ఉచితంగానే విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. సాంకేతిక విద్య అంటేనే పరిశ్రమలకు మానవ వనరులను అందించే సాధనమని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులు, తల్లిదండ్రుల పాత్ర మరువలేనిదని కొనిడారు.

రాష్ట్రంలో నాలుగు వేల మందికి ఉద్యోగాలు

రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెలగా పద్మారావు మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో నాలుగువేల మంది విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాల్ని పొందారని వెల్లడించారు. సాంకేతిక విద్యతో వచ్చే ఉద్యోగావకాశాలు, మారుతున్న కోర్సులతో పాటు కొత్తగా ప్రారంభిస్తున్న కళాశాలల గురించి వివరించారు. విజయం అనేది సుదీర్ఘ కృషికి నిదర్శనమని తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌పై పట్టు సాధించి, నైపుణ్యాలు, సృజనాత్మకతను అలవర్చుకోవాలని సూచించారు. తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు మాట్లాడుతూ ఉద్యోగాలని సాధించిన విద్యార్థులు శ్రమతో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె. ఉషారాణి మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 53 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు తెలిపారు. అనంతరం వివిధ సంస్థల్లో ఉద్యోగాల్ని పొందిన విద్యార్థినులకు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అపెక్స్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శరణం నరేంద్రకుమార్, ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాటూరిలో అరుదైన గుండె శస్త్ర చికిత్సలు

గుంటూరు మెడికల్: క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలు చేసి రోగుల ప్రాణాలు కాపాడినట్లు కాటూరి మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రాజు అయ్యర్ చెప్పారు. చినకొండ్రుపాడులోని కళాశాలలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలోని పెదమజ్జారు గ్రామానికి చెందిన రత్నకుమారి(64)కి ఫిబ్రవరిలో గుండె సమస్య తలెత్తడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్టంట్ వేశారన్నారు. ఆపరేషన్ తరువాత కొన్ని రోజులకు మరలా గుండెనొప్పి, జ్వరం, వాంతుల సమస్య రావడంతో పలు ఆసుపత్రులు తిరిగినా ఫలితం లేక తమ దగ్గరకు వచ్చినట్లు చెప్పారు.ఆమెకు యాంజియోగ్రామ్ చేసి స్టంట్ 45 శాతం బ్లాక్ అవడం, చీముపట్టి, వాపు ఉండటం గమనించామని వివరించారు. ఆపరేషన్ చేసి చీముపట్టిన స్టంట్ తీసి మళ్లీ బైపాస్ ఆపరేషన్ చేశామని తెలిపారు. ఇది చాలా ప్రమాదకరమైన చికిత్స అని, వేలల్లో ఒక్కరికి మాత్రమే ఇలా జరుగుతోందని ఆయన వెల్లడించారు. ఏప్రిల్ మూడో వారంలో విజయవంతంగా ఆపరేషన్ చేశామని, ఆరోగ్యం కుదటపడడంతో మంగళవారం ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేస్తున్నట్లు డాక్టర్ రాజు అయ్యర్ పేర్కొన్నారు.



శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న వారితో వైద్య బృందం

■ గుంటూరు జిల్లా నాగవరానికి చెందిన పుట్టుకతో అంధుడైన 36 సంవత్సరాల బ్రహ్మయ్య గత నాలుగేళ్లుగా గుండె సమస్యతో బాధపడుతూ తమ వద్దకు చికిత్స కోసం వచ్చాడని డాక్టర్ రాజు అయ్యర్ తెలిపారు. పరీక్షలు చేసి నాలుగు కవాటాల్లో రెండు పూర్తిగా దెబ్బతిన్నాయని గుర్తించినట్లు చెప్పారు. ఎంతో క్లిష్టమైన సర్జరీని ఏప్రిల్ మూడో వారంలో బ్రహ్మయ్యకు చేశామన్నారు. అతడ్ని కూడా మంగళవారం డిశ్చార్జి చేస్తున్నామని వెల్లడించారు. క్లిష్టమైన కార్డియాలజీ సర్జరీలు చేసి రోగులకు నూతన జీవితాలు ఇచ్చిన కార్డియోథొరాసిక్ సర్జరీ వైద్యుల్ని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సైరా, చైర్మన్ సుబ్బారావు అభినందనలు తెలిపారు.

విద్యారంగ అభివృద్ధికి కన్నా మాస్టార్ అవిరళ కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న కన్నా మాస్టారు జిల్లా గర్వించదగిన విద్యావేత్త అని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. రైలుపేటలోని కన్న ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సోమవారం ఇటీవల ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం ద్వారా 'విద్యాబోధన ప్రాధాన్యత' అనే అంశంపై పరిశోధనతో డాక్టరేట్ అందుకున్న సందర్భంగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కె.ఎస్. లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కలసి కన్న మాస్టారు, రాజేశ్వరిదేవి దంపతుల్ని సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ వాణిజ్య శాఖలో ఉన్నతాధికారి ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదులుకుని పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల విద్యాభివృద్ధికి ఐదు దశాబ్దాల పాటు జీవితాన్ని అంకితం చేసిన విశిష్ట విద్యావేత్త డాక్టర్ కన్నా మాస్టారు అని కొనియాడారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ తాను చిన్నప్పుడే కన్నా మాస్టారు దగ్గర చదువుకుని ఉంటే మరింతగా పరిణతి చెందేవాడినని చెప్పారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ విద్యాభిక్ష పెట్టి కుటుంబాల్లో వెలుగులు నింపి వేలాది మంది విద్యార్థుల హృదయాల్లో డాక్టర్ కన్నా మాస్టారు చిరస్థాయిగా నిలబడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వాణిజ్య పన్నుల డెప్యూటీ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి పాల్గొన్నారు.



కన్న మాస్టారు దంపతులను సత్కరిస్తున్న మేయర్ మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే ముస్తఫా

తాగునీరు, పారిశుద్ధ్యంపై మరింత శ్రద్ధ అవసరం

రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి


నెహ్రూనగర్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు శుద్ధమైన మంచినీరు సరఫరాతో పాటు ఇంటి పన్నుల పారదర్శకత, మురికి నీటి పారుదల వ్యవస్థ తదితర అంశాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం రేట్ పేయర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన నారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో మున్సిపల్ అధికారులు రేట్ పేయర్స్ అసోసియేషన్, అవగాహన, జన విజ్ఞాన వేదిక వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహించి స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని తెలిపారు. ప్రస్తుత నగర కమిషనర్ కూడా తమ అసోసియేషన్ సభ్యుల సూచనలు, సలహాలను సానుకూలంగా తీసుకున్నారని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ అధ్యక్షుడు సీహెచ్. పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో సీనియర్ సిటిజన్స్, రేట్ పేయర్స్ సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ సచివాలయ స్థాయిలో అధికారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మానవతా స్వచ్ఛంద సంస్థ నగర అధ్యక్షుడు ఎస్. రామారావు మాట్లాడుతూ అన్ని డివిజన్లో రేట్ పెయిర్స్ సంఘాల్ని ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక సమస్యలపై ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని నేర్పవచ్చని తెలియజేశారు. లోక్ సత్తా నాయకులు వల్లూరి సదాశివరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల హితం కోసం సేవలు, ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పి. పరంధామయ్య, ప్రధాన కార్యదర్శి మది రాధాకృష్ణ, కార్యదర్శులు ఆర్. అంజిరెడ్డి, ఆర్. రామ్‌కుమార్, సహాయ కార్యదర్శి డాక్టర్ నూతలపాటి అరవింద, ప్రత్యూష సుబ్బారావు, దాసరి రామ్మోహనరావు, ఆడిటర్ నందూరి ఆనంద్ కృష్ణ, కోశాధికారి సాయిరాం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

సమగ్ర వికాసానికి లలిత కళలు దోహదం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆరున్నర దశాబ్దాలకు పైగా నగరంలో 16 కేంద్రాల ద్వారా చిన్నారులకు విద్యాబోధనతో పాటు సమగ్ర వికాసానికి లలిత కళలు, నైతిక విలువలు, సాహిత్యం వంటి రంగాల్లో శిక్షణ కల్పిస్తున్నట్లు బాలానంద కేంద్రాల అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. కృష్ణనగర్‌లోని బాలానంద కేంద్ర ఆధ్వర్యంలో సోమవారం నోబుల్ పబ్లిక్ స్కూల్లో నూతనంగా నిర్మించిన కల్చరల్ సెంటర్‌తోపాటు వేసవి కళల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పైబడిన బాలబాలికలకు నెల రోజులపాటు చిత్రలేఖనం, గాత్రం, భరతనాట్యం, యోగా, బ్రెయిన్ గేమ్స్, కీబోర్డ్, చెస్, క్లాసికల్, వెస్టర్న్ డాన్సుల శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు కృష్ణనగర్‌లోని బాలానంద కేంద్రంలోని నోబెల్ పబ్లిక్ స్కూల్ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బాలానంద కేంద్ర కార్యదర్శి నడింపల్లి గురుదత్త, కమిటీ సభ్యులు బి.శ్రీనివాస్, నాగరాజు, సుభాష్, డాక్టర్ కె.కొండయ్య, కల్చరల్ సెంటర్ నిర్వాహకులు మాచిరాజు రాజేష్, స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



శిబిర ప్రారంభోత్సవంలో చిన్నారులతో రాధాకృష్ణమూర్తి, గురుదత్త తదితరులు

టెక్నికల్ కోర్సులతో సత్వర ఉపాధి అవకాశాలు

గుంటూరు రూరల్: టెక్నికల్ విద్యా కోర్సుల ద్వారా విద్యార్థులు త్వరితగతిని ఉపాధి పొందవచ్చని నాగ సింధూ స్పిన్నింగ్ అండ్ జిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ ఆర్. శ్రీనివాసరావు తెలిపారు. నల్లపాడులోని ఎమ్‌బీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ టెక్స్‌టైల్స్ కళాశాలలో సోమవారం ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నైపుణ్యాలు కలిగిన విద్యార్థుల్ని టెక్స్‌టైల్స్ సంస్థలకు అందిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2022-23 బ్యాచ్‌లో 18 మంది విద్యార్థులకు 17 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారని, ఒకరు పై చదువులకు వెళ్లినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, చల్లావారిపాలెం గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో టెక్స్‌టైల్స్ శాఖ అధికారి కె.మహమ్మద్, సీనియర్ లెక్చరర్ యు. రాధాకృష్ణ, ఎస్. నాగేశ్వరరావు, బి. వెంకటేశ్వర్లు, ఏ. జనార్దనరావు, జి. లక్ష్మీజ్యోతి, కృష్ణారావు, జ్యోతిర్మయి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం

ప్రజల సమస్యలకు సకాలంలో పరిష్కారం

నెహ్రూనగర్: ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువు లోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని డెప్యూటీ కమిషనర్ సీహెచ్. శ్రీనివాస్ స్పష్టం చేశారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ స్పందనకు అందే ఫిర్యాదులపై విభాగాధిపతులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు. పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలని ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులు కూడా ప్రతి రోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు జరిగే స్పందనలో అందుబాటులో ఉండాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 29 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 14, ఇంజినీరింగ్ విభాగానికి ఐదు, ప్రజారోగ్య విభాగానికి ఒకటి, రెవెన్యూ విభాగానికి ఐదు, ఉపా సెల్ విభాగానికి మూడు, అకౌంట్స్ విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులందాయని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, ఏడీహెచ్ రామారావు, మేనేజర్ శివన్నారాయణ, డెప్యూటీ సిటీప్లానర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

GOVERNMENT OF ANDHRA PRADESH
ENDOWMENT DEPARTMENT
TENDER NOTICE
File No. COE-25/7/2023 DP CELL Dt.30/04/2023
Quotations are invited from the Offset Printers to design and supply of A3 size 300gsm quality of art board Brochure 2 Pages, F & B Matt Lamination, F&B Spot Lamination with 2 Page centre pin Binding, 130 gsm Art Paper Cover & A3 size 130 gsm Art paper pamphlets 2 Pages for the purpose of invitation of Maha Yagam.
Quantity Required : Brochure 1,000 Copies, Pamphlets 20,000 Copies
To be Supplied on : 04-05-2023
For details contact Office of the Commissioner, Endowments Department, Gollapudi, Vijayawada, Ph: 9491000637.
Vijayawada
30.04.2023
Sd/-, S. Satyanarayana
Commissioner of Endowments, Government of AP

